


TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 162 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | ఆదివారం 17 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## తమ్ముడి మృతితో బాధపడుతున్న చంద్రబాబుకు రాహుల్ గాంధీ ఫోన్



- చంద్రబాబుకు సోదర వియోగం
- గుండెపోటుతో కన్నుమూసిన నారా రామ్మూర్తినాయుడు
- చంద్రబాబుకు ఫోన్ చేసి పరామర్శించిన రాహుల్ గాంధీ

**అమరావతి / శాసనసభ :** ఏపీ సీఎం చంద్రబాబు తన తమ్ముడు నారా రామ్మూర్తినాయుడి మృతితో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇవాళ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు... ఏఐజీ ఆసుపత్రి వద్ద బాధలో ఉన్న ఇతర కుటుంబ సభ్యులను చూడగానే మరింత వేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో, సోదరుడి మృతితో తీవ్ర విచారానికి గురైన చంద్రబాబుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేసి పరామర్శించారు. విషాదంలో ఉన్న చంద్రబాబు కుటుంబానికి రాహుల్ గాంధీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## చంద్రబాబు సోదరుడి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి





వివరాలు »»2లో




సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త!

# ఆ రైతులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు..

- టెక్స్టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలం
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం
- వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు
- 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

**శాసనసభ / హైదరాబాద్ :** కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు శుభవార్త చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి. వరంగల్లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో స్పష్టం చేశారు. 2024 జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాకు వచ్చిన సందర్భంగా టెక్స్టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు ఉత్తర్వులు ఈ మేరకు నేడు 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మిగతా »»2లో

## జీ -20 సమ్మిట్ కోసం బయలుదేరిన ప్రధాని మోడీ..మూడు దేశాల్లో పర్యటన..




**ఢిల్లీ / శాసనసభ :** ప్రధాని నరేంద్రమోడీ బ్రెజిల్‌లో జరిగే జీ-20 సమ్మిట్ కోసం బయలుదేరారు. బ్రెజిల్ సహా గయానా, నైజీరియా దేశాల్లో పర్యటించనున్నారు. గతేడాది జీ-20 సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. 17 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నైజీరియాలోలో పర్యటించబోతున్నారు. 5 దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని గయానకు వెళ్లడం ఇదే మొదటిసారి. ప్రధాని తన 5 రోజుల పర్యటనలో మొదటి రెండు రోజులు(నవంబర్ 16-17) నైజీరియాలో గడపనున్నారు.

## కిషన్ రెడ్డిపై పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు



- కేసీఆర్ సూచనతోనే కిషన్ రెడ్డి అధ్యక్షుడు అయ్యాడని తీవ్రవ్యాఖ్య
- కలెక్టర్ మీద దాడిని సమర్థించడమేమిటని ఆగ్రహం
- మూసీ వద్ద రేపు నిద్రలేచాక నిజాలు చెప్పాలన్న మంత్రి

2

**శాసనసభ / హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచనతోనే కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని దక్కించుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్ సూచనతోనే మూసీ నిద్రకు సిద్ధమయ్యారని విమర్శించారు.

## ఏ బుల్డోజర్‌తో ఏ ఇల్లు కూలగొడతారో అనే భయం ఉంది



- మూసీ బాధితుల పక్షాన పోరాటం చేసే బాధ్యతను బీజేపీ తీసుకుంటోందన్న కిషన్ రెడ్డి
- హైడ్రా కారణంగా ప్రజలు తీవ్ర ఆందోళనగా ఉన్నారన్న కేంద్రమంత్రి
- భరోసా కల్పించేందుకే తాము మూసీ నిద్ర చేపడున్నామని వెల్లడి

2

## అమావాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమికి కూడా పేలట్లేదు.. పొంగులేటికి కేటీఆర్ చురకలు



**శాసనసభ / హైదరాబాద్ :** బాంబుల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమవాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమి నాటికి కూడా పేలుతలేవు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. ఆయన తుస్సు బాంబుల శాఖ మంత్రి అని కేటీఆర్ విమర్శించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి మీద ఈడీ దాడులు జరిగి 45 రోజులు అయ్యింది. ఈడీ కానీ బీజేపీ వాళ్లు కానీ ఇప్పటి వరకు ఒక్క ప్రకటన చేయటం లేదు. ప్రజలు ఆగం కావద్దు.

మిగతా »»2లో

## మహా వికాస్ అఘాడీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు

**శాసనసభ / హైదరాబాద్ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి దే అంతిమ విజయం అని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి మరియు ఏ.ఐ.సి.సి ఎన్నికల పరిశీలకులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల ఫలితాల భారతదేశం రాజకీయాలను మలుపు తిప్పనున్నాయని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మరట్వాడ ప్రాంతానికి ఏ.ఐ.సి.సి సీనియర్ పరిశీలకుడి గా నియమితులైన రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తో



కలసి ముఖ్ హెడ్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మహా వికాస్ అగాఢీ కూటమి 200 పై చిలుకు స్థానాలలో గెలుపు సాధించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మిగతా »»2లో

## అమిత్ షా,రాహుల్ గాంధీలకు ఈసీ నోటీసులు..

**ఢిల్లీ / శాసనసభ :** బీజేపీ,కాంగ్రెస్ పార్టీల స్టార్ క్యాంపెయినర్లు అయిన అమిత్ షా, రాహుల్ గాంధీలు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘం శనివారం నోటీసులు జారీ చేసింది. ఇద్దరు చేసిన వ్యాఖ్యలు ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించింది. బీజేపీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గే మహారాష్ట్ర, జారండ్ ఎన్నికలకు రెండు రోజుల ముందు,సోమవారం లోగా తమ రెస్పాన్స్ తెలియజేయాలని ఆదేశించింది. నవంబర్ 06న ముంబైలో జరిగిన ఒక సభలో రాహుల్ గాంధీ మాట్లాడు



తూ.."మహారాష్ట్ర నుంచి అవకాశాలను, పెట్టుబడులను ఇతర రాష్ట్రాలకు దోచిపెట్టారు" అని అన్నారు. రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేశారని ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది. " రాహుల్ గాంధీ తన ప్రకటనతో మహా రాష్ట్ర యువతను రెచ్చగొడుతున్నారు.

మిగతా »»2లో

## ఎదురుగా డ్రంకన్ డ్రైవ్.. పోలీసులకు భయపడి ప్రాణాలు పోగొట్టుకున్న యువకుడు..!



శాసనసభ / హైదరాబాద్ : ఊదమంటారనే భయమే ఊపిరి తీసింది.. పోలీసులకు భయపడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు ఓ యువకుడు. మద్యం తాగి వాహనం నడపడమే అతని నిండు నూరేళ్ల జీవితాన్ని బలితీసుకుంది. క్షణికావేశంలో చేసిన ఒక తప్పు వల్ల యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన హైదరాబాద్ మహానగరంలో చోటు చేసుకుంది. హైదరాబాద్ నగరం శంషాబాద్ ఫ్లైఓవర్ పై అర్ధరాత్రి ఓ యువకుడు ఫుల్లుగా మద్యం సేవించి వాహనం నడుపుతూ వెళ్తున్నాడు. వెళ్తూ వెళ్తూ ఆ మార్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండడం గమనించాడు. ఒకవేళ పోలీసులకు దొరికిపోతే ఫైన్, పోలీసు కేసు అంటూ ఎందుకీ తలనొప్పి అనుకున్నాడో ఏమో..! దారి మళ్లించి రాంగ్ రూట్లో వెళ్తూ ఓ కారును ఢీకొట్టాడు. రాంగ్ రూట్లో బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు కారును బలంగా ఢీకొట్టాడు. స్పీడ్‌గా రావడం వల్ల ప్రమాదం పెద్దగానే జరిగింది. దీంతో అక్కడికక్కడే ఆ యువకుడు మృతి చెందాడు. సదరు వ్యక్తి తాగిన మైకంలో పోలీసులను చూసి భయాందోళనలకు గురై రాంగ్ రూట్లో వెళ్లి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయడమే ఇంతటి అనర్థానికి దారి తీసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అందుకే ఒక్కోసారి మనం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలే పెద్ద ప్రమాదానికి దారి తీయొచ్చు. అసలు మద్యం తాగి వాహనం నడపడమే అతి పెద్ద తప్పు. అలాంటిది అర్ధరాత్రి రోడ్ల మీద ప్రయాణం చేయడం ఇప్పటి యువతకు సర్వసాధారణమే.! అయినప్పటికీ.. తమ ప్రాణాలు కూడా లెక్క చేయాల్సిన విచక్షణ ఖచ్చితంగా ఉండాలి. అది మరిచిన రోజు ఇలాంటి అనర్థాలు జరుగుతాయి. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు యువతకు కనువిప్పు కావాలి..!

## నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు



శాసనసభ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 1,401 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 115 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 65,361మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. రంగారెడ్డిలో 103 పరీక్ష కేంద్రాల్లో 56,394 మంది, హైదరాబాద్‌లో 102 కేంద్రాల్లో 45,918 మంది పరీక్ష రాయనున్నారు. ములుగు జిల్లాలో అత్యల్పంగా 9 కేంద్రాలుండగా.. 2,173 అభ్యర్థులు హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,395 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలకు హాజరుకానున్నారని టీజీపీఎస్సీ తెలిపింది. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కమిషన్ తెలిపింది. ఆది, సోమవారాల్లో గ్రూప్-3 పరీక్షలు జరగనున్నాయి.

## బీఆర్ఎస్ నేతలకు టీపీసీసీ చీఫ్ సవాల్.. అభివృద్ధిపై మేము చర్చకు సిద్ధం



శాసనసభ / హైదరాబాద్ : మూసీ పునరుజ్జీవం చేసి తీరుతామని వెల్లడించారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. ఇవాళ ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 19న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ కు నూకలు చెల్లినాయని, అందుకే ఆపార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధి, మేము ఏడాదిలో చేసిన అభివృద్ధిపై మేము చర్చకు సిద్ధమని ఆయన బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మూసీ పునరుజ్జీవం చేసి తీరుతామని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు. మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు ఏం చేశామో వరంగల్ విజయోత్సవ సభలో వెల్లడిస్తామని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?



శాసనసభ / హైదరాబాద్ : ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులు అరెస్టులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ స్పందిస్తూ.. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు బండి సంజయ్. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బండి సంజయ్ అన్నారు. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని, ఇంకా జాప్యం చేయకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు బండి సంజయ్.

## అమిత్ షా, రాహుల్ గాంధీలకు ఈసీ నోటీసులు..

రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేశారని ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది. " రాహుల్ గాంధీ తన ప్రకటనతో మహారాష్ట్ర యువతను రెచ్చగొడుతున్నారు. ఇది జాతి ఐక్యత, సమగ్రతకు ప్రమాదకరం. ఆయన ప్రసంగం అబద్ధాలతో నిండి ఉంది. మహారాష్ట్ర గుజరాత్, ఇతర రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు, శత్రుత్వం సృష్టించేందుకు ప్రయత్నించారు." అని నవంబర్ 11న ఈసీ ఎదుట బీజేపీ కంప్లైంట్ చేసింది. నవంబర్ 12న జార్ఖండ్ ధన్‌బాద్‌లో అమిత్ షా మాట్లాడుతూ... కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విభజన, దురుద్దేశపూరిత ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. " అమిత్ షా తన ప్రసంగంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, దేశంలో తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఎస్సీ ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను తొలగించాలని యోచిస్తోందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నవంబర్ 13న కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసింది.

## గురుకులంలో విద్యార్థిని సూసైడ్.. అసలు ఏం జరిగింది



శాసనసభ / హైదరాబాద్ : సంగారెడ్డి (మం) కోత్లాపూర్ జ్యోతిబాపులే గురుకులంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న స్వాతి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. గురుకులంలోని రెండవ ఫ్లోర్‌లో ఉదయం 6బీ30 నిమిషాలకు ఫ్యానుకి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.. ఉదయం రోజు మాదిరిగానే స్వాతి రోల్ కాల్‌కి కూడా హాజరై, పెండింగ్ వర్క్ ఉంది అని చెప్పి పైకి వెళ్లింది. తను ఎంతసేపటికి రాకపోవడంతో తోటి విద్యార్థినిలు రూమ్‌కి వెళ్లి చూడగా.. రూమ్ లాక్ చేసి ఉంది. ఎంత కొట్టినా తలుపు తీయలేదు. విండోలో నుంచి చూడగా స్వాతి ఉరి వేసుకోని కనిపించింది. ఆందోళనకు గురైన విద్యార్థినిలు.. విషయాన్ని టీచర్ల కు తెలియజేయడం తో వాళ్ళు రూమ్ డోర్ బద్దలుకొట్టి.. ఉరి వేసుకున్న స్వాతిని కిందికి దించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలిసులు విషయాన్ని లింగంపల్లిలోని స్వాతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్వాతి కుటుంబ సభ్యులు, బంధువులు గురుకుల పాఠశాల వద్దకు చేరుకోని స్వాతి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆత్మహత్య చేసుకునే అంత పిరికిదికాదు అని, ఇది ఆత్మహత్య కాదని ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. పోలీసులు జోక్యం చేసుకుని స్వాతి కుటుంబ సభ్యులు, బంధువులకు సర్ది చెప్పి.. మృతిపై మీకు ఏమైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.. ఇదే విషయంపై సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. స్వాతి మృతిపై కుటుంబసభ్యుల పై పిర్యాదు తీసుకున్నామని, పోస్ట్ మార్టం రిపోర్ట్ వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయ నన్నారు. చదువు ఒత్తిడి కూడా కొంత కారణం అని తెలుస్తుంది అని, పోస్ట్ మార్టం రిపోర్ట్ వచ్చాకే పూర్తి వివరాలు తెలుస్తాయి అని ఆయన చెప్పారు.

## బస్తీ నిద్ర కేసీఆర్ దిశా నిర్దేశమే: పొన్నం



శాసనసభ / హైదరాబాద్ : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ బిడ్డ అయితే.. డీఎన్ఏ పరీక్ష చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయన తెలంగాణ బిడ్డ అయితే రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలి కానీ.. అవరోధంగా ఎందుకు మారారని ప్రశ్నించారు. ఈ నెల 19న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ప్రజాపాలన సభ నిర్వహించనుంది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పొన్నం సభా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నది ప్రకాళన చేపడితే.. మూసీ నిద్రతో కిషన్‌రెడ్డి అడ్డుకోవడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. తొలి నుంచీ కేసీఆర్ డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సూచన మేరకే బీజేపీ అధ్యక్ష బాధ్యతలు సంజయ్ నుంచి కిషన్‌రెడ్డికి అప్పగించారని అన్నారు. కిషన్‌రెడ్డి మూసీ నిద్ర కూడా కేసీఆర్ డైరెక్షనే అని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడానికి కేసీఆర్.. కిషన్‌రెడ్డిని ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు

## మూసీ నివాసితులు గుబులులో ఉన్నారు..



శాసనసభ / హైదరాబాద్ : బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ఎన్టీవీ మాట్లాడుతూ.. మూసీ నివాసితులు దయనీయమైన గుబులులో ఉన్నారని తెలిపారు. ఎంతో ఆందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నమని తెలియజేస్తున్నారు.. కులీ నాళి చేసుకుంటూ 40 ఏళ్ల నుంచి ఇక్కడే నివసిస్తున్నారు.. వారి ఆవేదన వినడమే కాకుండా.. వారికి భారతీయ జనతా పార్టీ తరపున భరోసా కల్పిస్తున్నామ న్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ బస్తీ నిద్ర చేపట్టిందని ఆయన చెప్పుకొచ్చారు. నిజంగా మూసి ప్రక్షాళన చేయాలంటే.. అందుకు అనేకమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి.. డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్చి.. దానికి కావాల్సిన నిధులు కేటాయించండి.. ఆ రకంగా చేయకుండా మూసీ పరివాహక ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు.. ఈ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కూడా కాలేదు.. ప్రజల మీద ఎందుకీ ప్రతాపం?.. పేదలు చేసిన పాపం ఏంటి..? అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. అలాగే, 150 మీటర్ల దూరంలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ చేయడం ఏంటి? అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ క్వశ్చన్ చేశారు. ప్రభుత్వానికి చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు వ్యవహరిస్తున్నారు.. దున్నపోతు నిద్రలో ఉన్నట్లు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుంది.. కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది.. మూసి ప్రక్షాళన పేరు మీద 150 కోట్లతో అవసరమా అని ప్రశ్నిస్తున్నా.. మూసి నిద్ర పేరు మీద ఒక్క రోజు కార్యక్రమం కాదు.. ఇది బీజేపీ తరపున ఒక హెచ్చరిక మాత్రమే అని ఆయన తెలిపారు. భవిష్యత్ లో ఈ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి బీజేపీ నాయకులంతా కదం తొక్కారు.. ప్రభుత్వం ఇప్పటికైనా అప్రమత్తం అవ్వాలి.. పేదల జీవితాలతో చెలగాటం ఆడితే.. బుల్డోజర్లకు అడ్డం నిలబడైనా వారికి న్యాయం చేయడానికి మేము ఉన్నాం.. అర్ధాంతరంగా ఇండ్లు తొలగిస్తామని ఇక పక్ష నిర్ణయం తీసుకుంటూ ముందుకు వెళ్తే.. మీ ప్రభుత్వం తీవ్ర మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని లక్ష్మణ్ వెల్లడించారు.

## ఆ రైతులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు..సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త!

రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పార్క్ పై ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు శుభవార్త ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటికి ఐదు లక్షల రూపాయలతో 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రైతుల్లో సంతోషం రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ రైతులను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఇవ్వాలని అడిగినదే తడువుగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రైతులు ఆనందంతో ఉన్నారని అన్నారు. నవంబర్ 19న వరంగల్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా టెక్స్టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన రైతులు ఇండ్ల పట్టాలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ కు భూములు ఇచ్చిన రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## అమావాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమికి కూడా పేలట్లేదు.. పొంగులేటికి కేటీఆర్ చురకలు

ఎవరు ఎవరితో ఉన్నారో అర్థం చేసుకోవాలి. మాకు పదవులు, కొట్లాట, కేసులు కొత్తకాదు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. రేవంత్ రెడ్డితో మాకు గట్టు పంచాయితీ ఏమీ లేదు. కొడంగల్‌లో గిరిజనుల భూమి గుంజుకోవటంపై ప్రశ్నిస్తే ఆయనకు కోపం వస్తోంది. మూసీ కుంభకోణం గురించి ప్రశ్నిస్తే కోపం వస్తోంది. అర్హత లేని బావమరిది కంపెనీకి అమృత్ టెండర్లు కట్టబెట్టటంపై కోపం వస్తోంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద ఈడీ గురించి అడిగితే సీఎంకు కోపం వస్తోంది అని కేటీఆర్ తెలిపారు. ఏదో కేసులు పెట్టి జైల్లో పెడితే ప్రశ్నించటం మానేస్తామని వాళ్లు అనుకుంటున్నారు. నేను జైలుకు పోతే వందలాది మంది కేసీఆర్, కేటీఆర్‌లు పుట్టుకొస్తారు. ఇప్పుడే పోరాటం మొదలైంది. మరో నాలుగేళ్లు ఈ కాంగ్రెస్‌తో పోరాటం చేయాల్సి ఉంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఎందుకు పార్టీ మారాడో ప్రజలు అడగాలి. అభివృద్ధి కోసం పోయిన అంటే కేసీఆర్ కన్నా రేవంత్ రెడ్డి ఏం అభివృద్ధి చేసిండో చెప్పామనాలి అని ప్రజలకు కేటీఆర్ సూచించారు. ఎమ్మెల్యేలను బీజేపీ వాళ్లు మేకలను కొన్నట్లు కొంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెబుతున్నారు. ఖర్గేను తెలంగాణ రమ్మని చెబుతున్నా. ఇక్కడ మా మేకలు మీ మందలో తప్పిపోయాయి చూడాలని కోరుతున్నా. ప్రకాష్ గౌడ్, అరికెపూడి గాంధీలకు సిగ్గుందా? ఏ పార్టీలో ఉన్నారో చెప్పే దమ్ముందా? కేసీఆర్ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నిక రావటం ఖాయం. ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరటం ఖాయం. రాజేంద్రనగర్‌ను భవిష్యత్‌లో అద్భుతంగా ముందుకు తీసుకెళ్లే నాయకుడు కార్తీక్ రెడ్డి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కిషన్ రెడ్డిపై పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు

కిషన్ రెడ్డి డీఎన్ఏ పరీక్ష చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ఆయన అసలు తెలంగాణ బిడ్డేనా? తెలంగాణ బిల్లు ఎలా పాస్ అయిందో మీకు తెలియదా? కలెక్టర్‌ను కొట్టిన వారిని సమర్థిస్తున్న మీరు కేంద్రమంత్రి పదవికి అర్హులేనా? అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కలెక్టర్‌పై దాడి ఘటనను సమర్థించడ మేమిటని ప్రశ్నించారు. ఈ దాడి ఘటనపై బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఎంపీగా, కేంద్రమంత్రిగా ఏం చేశారో చెప్పాలన్నారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఈరోజు బీజేపీ చేస్తున్న 'మూసీ నిద్ర'పైనా పొన్నం ప్రభాకర్ స్పందించారు. బీజేపీ నేతలు మూసీ వద్ద రేపు నిద్రలేచిన తర్వాత అక్కడి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సూచించారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు మొద్దు నిద్ర నుంచి లేవాలన్నారు. నిధులు తేలేని బీజేపీ నేతలు మూసీ వద్దకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. మూసీ కాల్వ వాసన చూసిన తర్వాత అయినా వారు దైవసాక్షిగా నిజాలు చెబుతారని భావిస్తున్నానన్నారు.

## ఏ బుల్డోజర్‌తో ఏ ఇల్లు కూలగొడతారో అనే భయం ఉంది: కిషన్ రెడ్డి

హైడ్రా పేరుతో ఎప్పుడు ఏ బుల్డోజర్‌తో... ఏ ఇల్లును కూలగొడతారో అనే భయంతో మూసీ పరివాహక ప్రజలు తీవ్ర ఆందోళనతో ఉన్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మూసీ బాధితుల పక్షాన పోరాటం చేసే బాధ్యతను బీజేపీ తీసుకుంటోందన్నారు. బాధితులు నివాసం ఉంటున్న వివిధ ప్రాంతాల్లో ఈ రోజు బీజేపీ నేతలు బస చేస్తున్నట్లు చెప్పారు. తాను అంబర్‌పేటలోని తులసీనగర్‌లో నిద్రిస్తున్నానన్నారు. ప్రజలకు బీజేపీ తరపున భరోసా కల్పించేందుకు తాము బస్తీల్లో రాత్రి బస చేస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. తులసీ నగర్ చేరుకున్న కిషన్ రెడ్డి బీజేపీ మూసీ నిద్రలో భాగంగా కిషన్ రెడ్డి తులసి నగర్‌లో బస చేస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం ఆయన ఇక్కడకు చేరుకున్నారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మూసీ బాధితులకు న్యాయం జరగాలని తమ పార్టీ నాలుగు నెలలుగా పోరాటం చేస్తోందని స్థానికులకు తెలిపారు. బాధితులతో ఇప్పటికే ధర్నా కూడా నిర్వహించామని గుర్తు చేశారు.

## చంద్రబాబు సోదరుడి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు ఈ మధ్యాహ్నం కన్నుమూసిన సంగతి తెలిసిందే. తీవ్ర అనారోగ్యంతో హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గుండెపోటుకు గురయ్యారు. రామ్మూర్తినాయుడ్ని బతికించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఆయన తుదిశ్వాస విడిచారని ఏఐజీ వర్గాలు ప్రకటన విడుదల చేశాయి. రామ్మూర్తినాయుడి మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి మృతి దిగ్భ్రాంతికరం అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. రామ్మూర్తినాయుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## జీ -20 సమ్మిట్ కోసం బయలుదేరిన ప్రధాని మోడీ..మూడు దేశాల్లో పర్యటన..

"నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు, పశ్చిమ ఆఫ్రికా ప్రాంతంలో మా సన్నిహిత భాగస్వామి అయిన నైజీరియాకు ఇది నా మొదటి పర్యటన. మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి నా పర్యటన ఒక అవకాశంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యం, భాగస్వామ్య విశ్వాసం గురించి నేను భారతీయ సమాజాన్ని, నైజీరియాలోని స్నేహితులను కలవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను." అంటూ ప్రధాని ట్వీట్ చేశారు. నవంబర్ 18-19 తేదీల్లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా ఆతిథ్యం ఇవ్వనున్న %+%20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని తదుపరి బ్రెజిల్‌లోని రియో డి జెనీరోకు వెళతారు. ఆ తర్వాత ప్రధాని గయనాలో పర్యటించనున్నారు. 1968 తర్వాత ఒక భారత ప్రధాని ఈ దేశానికి వెళ్లడం ఇదే తొలిసారి. అక్కడ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు గయానా పార్లమెంట్‌లో ప్రసంగిస్తారు. తన పర్యటనలో మోడీ 2వ ఇండియా-కారికోమ్ సమ్మిట్‌లో కరేబియన్ దేశాల నాయకులతో చర్చించనున్నారు.

## మహా వికాస్ అఘాడీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు:ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో మహారాష్ట్ర లోని 48 స్థానాలకు గాను 31 స్థానాల్లో ఎంవీఏ కూటమి సాధించిన విజయమే ఇందుకు తార్కాణమని ఆయన గుర్తు చేశారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు పరుస్తున్నామన్నారు. **తెలంగాణలో హామీలపై..** తెలంగాణాలో 1.05 కోట్ల మహిళలు ఉచిత బస్ ప్రయాణం, 500 రూపాయల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు, 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ వంటి హామీలను కాంగ్రెస్ నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమాలు మహారాష్ట్రలో ఎంవీఏ పాలనకు నమూనా బ్లు ప్రింట్ గా నిలుస్తాయాన్నారు. మహారాష్ట్ర-తెలంగాణా రాష్ట్రాల నడుమ లెండి సచ ప్రాజెక్టు ను నిర్మించ నున్నట్లు ఆయన వెల్లడించారు. ఉభయ రాష్ట్రాల రైతాంగానికి ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూరుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. **ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలింపు..** బీజేపీ విభజన రాజకీయాలను ఆయన తూర్పారాబట్టారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి చేసిన తప్పిదాలపై ఆయన మండిపడ్డారు. మహారాష్ట్ర లోని ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టులను గుజరాత్ కు తరలించి మహారాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగించిన బీజేపీ కూటమని ఇక్కడి ప్రజలు తిరస్కరిస్తున్నారని ఆయన చెప్పారు. అధికారంలోకి వస్తే అమలు పరచనున్న ఐదు గ్యారెంటీలను ఆయన వివరించారు. **మహనీయుల వారసత్వాన్ని కాపాడేది.** రైతాంగానికి 3 లక్షల రుణమాఫీ, సమయానికి రుణాలు చెల్లించిన వారికి రూ. 50,000 బోనస్, మహిళలకు నెలకు రూ. 3000 మహాలక్ష్మి పథకం, ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్యాభిమా, ఉచిత మందుల సరఫరా లతో పాటు కులగణన చేపడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ రాష్ట్రంలో ఉద్భవించిన మహానేతలు ఛత్రపతి శివాజి మహారాజ్, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే , డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ ల వారసత్వాన్ని కాపాడగలిగేది మహా వికాస్ అగాఢీ కూటమి మాత్రమేనని, అందుకు అనుగుణంగా ఇక్కడి ప్రజలు ఎంవీఏ కూటమిని ఆదరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి





**తుర్కయాంజాల్, నవంబర్ 16 (శాసన సభ ) :** రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయంఅని తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి అన్నారు. అన్నారు.అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపక,ఉద్యోగ కల్పన,నైపుణ్యాభివృద్ధి ప్రోత్సహించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 వరకు సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తాయని అన్నారు.కార్యక్రమంలో రైతు సమితి రంగారెడ్డి జిల్లామాజీ అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి ,జక్కకృష్ణా రెడ్డి, చాపల యాదగిరి,సామా సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ రాందాస్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, సభ్యులు శీలం నర్సింహ్మా, సిబ్బంది పాల్గొన్నారు.

# 3 నెలలైనా ఉంటా..

## బస్తీకే నివాసాన్ని మార్చుకుంటా.. పేదల ఇళ్లను కూల్చనివ్వం.. సుందరీకరణ పేరిట రియల్ వ్యాపారం

## సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం.. మూసీ పరీవాహకంలో బీజేపీ నాయకుల బస్తీ నిద్ర

**శాసనసభ / హైదరాబాద్ :** " అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టును విమర్శించే నేతలు దమ్ముంటే ఒక రోజు పరీవాహక బస్తీలో ఉండాలని.. అలా చేయగలిగితే తాను ప్రాజెక్టును విరమించుకుంటానని " అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టును విమర్శించే నేతలు దమ్ముంటే ఒక రోజు పరీవాహక బస్తీలో ఉండాలని.. అలా చేయగలిగితే తాను ప్రాజెక్టును విరమించుకుంటానని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మూసీ పరీవాక ప్రాంతాల్లో బీజేపీ నేతలు శనివారం రాత్రి బస్తీ నిద్ర చేశారు. గోల్నాక డివిజన్‌లోని తులసీరాంనగర్(లంక) బస్తీలో కిషన్‌రెడ్డి, మూసారంబాగ్‌లో ఎంపీ లక్ష్మణ్, చైతన్యపురిలో ఎంపీ ఈటల రాజేందర్ బస చేశారు. తులసీరాంనగర్ బస్తీలో శనివారం సాయంత్రం కిషన్‌రెడ్డి పర్యటించారు. రచ్చబండ నిర్వహించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రకటనలతో ప్రజలు భయపడుతున్నారని, ఎప్పుడు బుల్డోజర్ వచ్చి వారి ఇళ్లను కూలగొడుతుందోనని భయాందోళనలో ఉన్నారని చెప్పారు. పేద ప్రజలు కష్టపడి ఇళ్లు కట్టుకుని 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, ప్రభుత్వం వారి ఇళ్లను కూల్చి వేస్తామంటే తాము అడ్డుకుంటామని తెలిపారు. "మూసీ సుందరీకరణ ఉద్దేశ్యం ఏమిటి..? ప్రాజెక్టు ఎలా ఉండబోతోంది..? నిధులు ఎక్కడ నుండి తీసుకొస్తున్నారు..? పేదల ఇళ్లను కూల్చి రూ.లక్షా యాభై వేల కోట్లతో సుందరీకరణ అవసరమా..?" అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్, విధివిధానాలు లేవని.. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయడం లేదనడం సరికాదని అన్నారు. మూసీ పునరుద్ధరణకు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. నదిని ప్రస్తుతం ఉన్న విధంగానే ఉంచి.. రిటైనింగ్ గోడలు కట్టి పనులు చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.ఎన్ని బుల్డోజర్లు పంపుతావో పంపు: లక్ష్మణ్ 'రేవంత్..



మూసీ సుందరీకరణ పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చేందుకు ఎన్ని బుల్డోజర్లు పంపుతావో పంపు. వాటికి అడ్డుగా నిలిచి అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉంటాం' అని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మూసీ నిద్రలో భాగంగా మూసారంబాగ్ శాలివాహననగర్‌లో శనివారం రాత్రి ఆయన బస చేశారు. అంతకుముందు స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడొద్దని.. బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీ వాసులతో కలిసి లక్ష్మణ్ రాత్రి భోజనం చేశారు. మూసీ సుందరీకరణకు సంబంధించి ఇప్పటి వరకు డీపీఆర్ సిద్ధం కాలేదని.. అలాంటప్పుడు ఏ ధైర్యంతో ఇళ్లను కూల్చివేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిలదీశారు. చైతన్యపురి డివిజన్‌లోని ఫణిగిరి కాలనీలో ఆయన బస చేశారు. ఫణిగిరి కాలనీ, మారుతినగర్ ఫేజ్-1, ఫేజ్-2లను సందర్శించారు. రేవంత్ తుగ్లక్ పాలనతో మూసీ పరీవాహక ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడని మండిపడ్డారు. గోల్నాక డివిజన్‌లోని కమలానగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, అంబేద్కర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే రత్నం, శాస్త్రీనగర్‌లో మాజీ మంత్రి కృష్ణ యాదవ్ బస్తీ నిద్ర చేశారు.

# బియ్యం తరలిపోతోంది..!

## - అక్టోబర్‌లో 86 శాతం పెరిగిన ఎగుమతులు

## - విలువ రూ.8870 కోట్లకు పైనే...

**శాసనసభ / హైదరాబాద్ :** భారత్ నుంచి విదేశాలకు భారీ స్థాయిలో బియ్యం తరలిపోతోంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలో 86 శాతం మేర బియ్యం ఎగుమతులు పెరిగాయి. ఎగుమతుల విలువ ఒక బిలియన్ డాలర్ మార్కును దాటింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం..అక్టోబర్‌లో బియ్యం ఎగుమతుల విలువ రూ.8874.81 కోట్లుగా ఉన్నది. గతేడాది ఇదే సమయంలో ఇది రూ.4776.98 కోట్లకు పైగా అంటే, ఈ సారి పెరుగుదల 85.79 శాతం కావటం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బియ్యం ఎగుమతుల విలువ దాదాపు 5,862.96 కోట్లుగా ఉన్నది.ఈ ఏడాది సెప్టెంబర్ 28న కేంద్రం నాన్-బాస్మతీ వైట్ రైస్ ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసింది. అయితే, కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ని టన్నుకు రూ.41,395గా విధించింది. ఆ తర్వాత అక్టోబర్ 23న ఈ పరిమితిని కూడా కేంద్రం తొలగించింది. సెప్టెంబర్ 27న, నాన్-బాస్మతి వైట్ రైస్‌పై 20 శాతం ఎగుమతి సుంకాన్ని కేంద్రం తీసేసింది. అలాగే, మూడు కేటగిరిల బియ్యంపై ఎగుమతి సుంకాన్ని సగానికి తగ్గించింది. ఆ తర్వాత అక్టోబర్ 22న సుంకాన్ని సున్నాకు చేసింది.

అక్టోబర్ నెలలో బియ్యం ఎగుమతుల్లో పెరుగుదలతో.. 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఏడు నెలల్లో(ఏప్రిల్-అక్టోబర్) మొత్తం బియ్యం ఎగుమతి.. 5.27 శాతం పెరుగుదలను చూసింది. మొత్తం ఎగుమతి విలువ దాదాపు రూ.52,130.96 కోట్లు.. గతేడాది ఇదే సమయంలో ఈ విలువ దాదాపు రూ.49,500.92 కోట్లుగా నమోదు కావటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో భారత మొత్తం బియ్యం ఎగుమతుల విలువ రూ.44,734.31 కోట్లుగా ఉంటే.. అది ఈ



ఏడాది సెప్టెంబర్ నాటికి రూ.43,253.24 కోట్లకు పడిపోయింది. అంటే, ఈ తగ్గుదల 3.33 శాతం.

**- వరి ఉత్పత్తిలో భారత్, చైనాలది పైచేయి**

ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారు, ఎగుమతిదారుగా ఉన్నది. భారత్, చైనా కలిసి ప్రపంచ బియ్యం ఉత్పత్తిలో సగం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. బియ్యం విషయంలో చైనా అతిపెద్ద వినియోగదారు కాగా.. ఎగుమతుల్లో మాత్రం చిన్నదే. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (యూఎస్‌డీఏ) సమాచారం ప్రకారం.. గతేడాది ప్రపంచ మొత్తం బియ్యం ఎగుమతుల్లో భారత వాటా 33 శాతం (17 మిలియన్ టన్నులు)గా ఉన్నది. నాన్-బాస్మతి వైట్ రైస్ ఎగుమతులపై నిషేధానికి ముందు 2022లో ఇది 40 శాతంగా ఉన్నది. ప్రపంచ రైస్ మార్కెట్‌లో భారత్‌కు థారులాండ్, వియత్నాంలు ప్రధాన పోటీదారుగా ఉన్నాయి.

# మీ కిడ్నీలు కలకాలం బాగుండాలంటే.. ఈ పదార్థాలను తినకపోవడమే బెటర్.. అవేంటో తెలుసా..



మన శరీరంలో ముఖ్యమైన అవయవాలలో మూత్రపిండాలు ఒకటి.. అందుకే.. కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.. ప్రస్తుత కాలంలో చాలామంది మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారు.కిడ్నీ వ్యాధి అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఒక వైద్య పరిస్థితి.. అయినప్పటికీ, జీవనశైలి ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు చేయడం ద్వారా మీరు కిడ్నీ వ్యాధి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు. మూత్రపిండాలు మన శరీరం ముఖ్యమైన వడపోత ప్రక్రియలను నిర్వహిస్తాయి. మీరు ఈ అవయవానికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతుంటే.. కొన్ని పదార్థాలు తినడం మానుకోవాలి.. లేకపోతే కిడ్నీ వ్యాధుల సమస్య మరింత పెరుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎలాంటి పదార్థాలను తినకూడదో తెలుసుకోండి..కిడ్నీ వ్యాధి కారణంగా శరీరంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి.. అటువంటి పరిస్థితిలో, మీరు ఈ సమస్య నుంచి ఉపశమనం పొందాలంటే, మీరు కొన్ని రకాల ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది.. దీంతో కిడ్నీలను కాపాడుకోవచ్చు..**కిడ్నీ రోగులు ఈ పదార్థాలకు దూరంగా ఉండటమే బెటర్..**అధిక-పొటాషియం ఆహారాలు: పొటాషియం ఒక ముఖ్యమైన ఖనిజం.. ఇది నరాలు %-% కండరాల కణాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. అయినప్పటికీ, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు అదనపు పొటాషియం హానికరం. మీరు అరటి, నారింజ, బంగాళాదుంప వంటి వాటి వినియోగాన్ని తగ్గించాలి.మితిమీరిన సోడియం: మనం ఉప్పు ద్వారా చాలా సోడియం పొందుతాం.. వాస్తవానికి, వైద్య నిపుణుల ప్రకారం.. ఒకవ్యక్తి రోజులో 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదు. ఎందుకంటే ఇది మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు, ఇది విషం కంటే తక్కువ కాదు. మీరు ఫ్రైస్, సాల్ట్ చిప్స్, ఫాస్ట్ ఫుడ్, అన్ని రకాల ఉప్పు పదార్థాలకు దూరంగా ఉండాలి.రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసాలు: రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసాలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. శరీరంలో వ్యర్థ పదార్థాలను పేరుకుపోవడానికి సహాయపడుతుంది. ప్రోటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై ఒత్తిడి పడుతుంది. ఇది కిడ్నీ రోగుల సమస్యలను పెంచుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మటన్, గొడ్డు మాంసం, పంది మాంసం తినకుండా ఉండాలి.కెఫిన్: భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చాలా మంది తమ రోజును ఒక కప్పు టీ లేదా కాఫీతో ప్రారంభిస్తారు. ఇది మీకు కొంతకాలం తాజాదనాన్ని అందించినప్పటికీ.. దీర్ఘకాలంలో ఇది మూత్రపిండాలకు హాని చేస్తుంది. మీరు కిడ్నీ వ్యాధిగ్రస్తులైతే దీనిని తాగకపోవడమే మంచిది.

# 14 రోజులు ప్రతిరోజూ అల్లం తింటే ఏమవుతుంది? అద్భుతమైన ప్రయోజనాలు



అల్లం ప్రతి ఇంట్లో వాడతారు. అల్లంలో ఎన్నో ఆరోగ్యకరమైన గుణాలు ఉన్నాయి. ఆహారంలో మసాలాగా మాత్రమే కాకుండా టీ, డికాక్షన్, ఆయుర్వేద ఔషధంగా కూడా ఉపయోగిస్తారు.అల్లం వివిధ ఆరోగ్యకరమైన, ప్రయోజనకరమైన ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. ఇది శరీరం ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి, మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లంలో కార్బోహైడ్రేట్లు (100 గ్రాములకు 18 గ్రాములు), ప్రోటీన్ (100 గ్రాములకు 2 గ్రాములు), విటమిన్ సి, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ ఉన్నాయి. మీరు 14 రోజులు క్రమం తప్పకుండా అల్లం తీసుకుంటే అది శరీరంపై కొన్ని అద్భుత ప్రభావాలు కనిపిస్తాయి. ఆ ప్రయోజనాలు ఏంటో చూద్దాం.

**14 రోజులు అల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:**

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డా. వరుసగా 14 రోజులు అల్లం తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని సౌరభ్ సేథి చెప్పారు. ఇది గ్యాస్ట్రిక్ యాసిడ్‌ను నియంత్రిస్తుంది. అలాగే పేగు కండరాలను యాక్టివ్ చేస్తుంది. తద్వారా మన ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అదనంగా 14 రోజులు అల్లం తినడం వల్ల కడుపు నొప్పి, ఉబ్బరం, అజీర్ణం కూడా తగ్గుతాయి.

**వాపును తగ్గిస్తుంది :** నిపుణుల అభిప్రాయం ప్రకారం, అల్లంలో జింజెరాల్ అనే పదార్థం ఉంది. ఇది మీ శరీరంలోని ఇన్ఫ్లమేటరీ బ్యాక్టీరియాను చంపడానికి సహాయపడుతుంది. అల్లం ఒక సహజ శోథ నిరోధకం. ఇది వాపు వంటి సమస్యలపై ప్రయోజనకరమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది.

**గ్యాస్ట్రిక్ కదలిక :** ఇది కడుపు అంతర్గత చర్యకు సంబంధించిన సమస్య. ప్రతిరోజూ 14 రోజులు అల్లం ముక్కను తినడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది కడుపు పూతల లేదా కణితుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అల్లం తినడం వల్ల పేగుల కదలిక కూడా జరుగుతుంది.

**యాంటీఆక్సిడెంట్లు :** అల్లం ఆరోగ్యకరమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఇది శరీరం సంక్రమణతో పోరాడటానికి సహాయపడుతుంది. 14 రోజుల పాటు క్రమం తప్పకుండా అల్లం తీసుకోవడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి బలపడుతుంది. తద్వారా జలుబు, దగ్గు, వైరల్ వ్యాధుల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు.చెడు కొలెస్ట్రాల్: అల్లం సహజ రక్తాన్ని పలచబరుస్తుంది. బ్లడ్ థినర్స్ తీసుకునే వారు అల్లం తినవచ్చు. కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు 14 రోజులు అల్లం తినాలి. ఇది వారి శరీరంలోని మురికి కొవ్వును కరిగించి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అల్లం తినడం వల్ల గుండె జబ్బులు కూడా తగ్గుతాయి.

# లగచర్ల ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

**శాసనసభ / హైదరాబాద్ :** లగచర్లలో రైతులు దాడులు చేశారన్న నెపంతో పోలీసులు అక్కడి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ నేతలు శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.బాధిత మహిళలతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు కమిషన్ చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు తమతో పోలీసులు వ్యవహరించిన తీరును వివరించారు. తమపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార కేసులు నమోదు చేయాలని కోరారు. లగచర్ల ఘటనలో దాడి జరిగింది ఎస్సీ, ఎస్టీలపైనేనని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపించారు.రైతులు దాడులు చేశారన్న నెపంతో ఎస్సీ, ఎస్టీ మహిళలతో పోలీసులు అసభ్యకంగా ప్రవర్తించారని, ఈ అంశంపై దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కమిషన్‌ను కోరామన్నారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలనకు లగచర్లలో పోలీసులు వ్యవహరించిన తీరే ఉదాహరణ అన్నారు. రేవంత్ తన నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనులపై



దురహంకారంతో వ్యవహరిస్తూ వారి భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. ఫార్మా కంపెనీ కోసం భూములు కోల్పోతున్న ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. త్వరలోనే కమిషన్ లగచర్లలో పర్యటిస్తుందని తెలిపారు

# లగచర్ల ఘటన.. 25కు చేరిన అరెస్టులు

## మరో నలుగురికి జ్యుడీషియల్ రిమాండ్

**శాసనసభ / హైదరాబాద్ :** లగచర్ల ఫార్మావిలేజ్ ఘటనలో పోలీసులు శనివారం మరో నలుగురిని అరెస్టు చేశారు.పరిగి ఠాణా నుంచి వారిని తరలించి.. కొడంగల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరచగా.. జడ్జి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో.. ఇప్పటి వరకు రిమాండ్ అయిన వారి సంఖ్య 25కు చేరుకుంది. ఈ కేసులో ఇంకా 22 మంది అరెస్టు కావాల్సి ఉండగా.. కీలక నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.వికారాబాద్‌కు మహేశ్ భగవత్‌లగచర్ల కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ శనివారం వికారాబాద్‌కు వచ్చారు. తొలుత జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులతో సమావేశమై.. లగచర్ల దర్యాప్తు తీరుపై ఆరా తీశారు. మిగతా నిందితుల అరెస్టుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులపై రైతులు, ప్రజలు దాడి చేయడానికి దారితీసిన పరిస్థితులు.. పోలీసులు వ్యవహరించిన తీరును ఆ సమయంలో ఘటనాస్థలిలో ఉన్న పోలీసులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు అధికారులు దాడికి ముందు.. ఆ తర్వాత పరిస్థితులను ఆయనకు వివరించారు. కీలక నిందితుడు సురేశ్‌రాజ్, మరో ముగ్గురి అరెస్టుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. లగచర్ల, రోటింబడ తండా, పులిచర్ల తండా.. వాటి పరిసర గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితిని



అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నేరుగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఘటన గురించి ఆయనను కూడా అడిగి తెలుసుకున్నారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి జరిగిన తీరు.. తాము దాడి నుంచి బయటపడిన విధానం గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం మహేశ్ భగవత్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తుండగా మీడియా మాట్లాడేందుకు ప్రయత్నించింది. దానికి ఆయన నిరాకరిస్తూ కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.కలెక్టర్‌కు భద్రత పెంపు లగచర్ల దాడి నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు హోంశాఖ భద్రత పెంచింది. ప్రస్తుతం ఆయనకు ఉన్న 1o1 భద్రతను 2o2గా మార్చింది. అంటే.. ఆయనకు భద్రతగా సాయుధ బలగాల (ఏఆర్)కు చెందిన ఇద్దరేసి గన్‌మన్లు రెండేసి షిఫ్టుల్లో పనిచేస్తారు.

## 'కుబేర'.. మాటల్లేకుండా పాత్రల లోతుల్లోకి!



ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.రష్మిక కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే కథానాయకుడు మహేశ్‌బాబు శుక్రవారం ఈ చిత్ర గ్లింప్స్ ను విడుదల చేశారు. ప్రచార చిత్రంలో ఎలాంటి సంభాషణలు వినిపించకున్నా..పాత్రల తాలూకూ లోతును హత్తుకునేలా చూపించే ప్రయత్నం చేశారు. ఇది ముంబయి కేంద్రంగా సాగే కథ. ఈ గ్లింప్స్‌లో బిచ్చగాడి తరహా గెటప్‌లో ధనుష్ కనిపించిన తీరు.. కుక్కపిల్లను పట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ కనిపించిన షాట్..భారీ మొత్తంలో డబ్బు కట్టలతో నిండి ఉన్న గదిలో నాగార్జున నిల్చొని ఉండటం.. డీగ్లామర్ లుక్‌లో రష్మిక కనిపించిన తీరు.. అన్నీ ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నాయి. మరి ఈ చిత్ర కథేంటి?దీంట్లోని పాత్రల స్వభావమేంటి? అన్నది ఇప్పటికైతే స్పష్టత రాకున్నా ఈసారి శేఖర్ కమ్ముల ఓ కొత్తదనం నిండిన కథను రుచి చూపించనున్నారని అర్థమవుతోంది. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఛాయాగ్రహణం: నికేత్ బొమ్మి.


## 'అమరన్'.. థియేటర్‌పై పెట్రోల్ బాంబులతో దాడి

శివ కార్తికేయన్ , సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో ఈ సినిమా ప్రదర్శితమవుతోన్న ఓ థియేటర్ వద్ద ఊహించని ఘటన ఎదురైంది.ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు థియేటర్‌పై పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. దీనికి సంబంధించిన కొన్ని దృశ్యాలు బయటకు వచ్చాయి. దీనిపై పోలీసు అధికారులు స్పందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. వారు దాడి చేయడానికి గల ప్రధాన కారణం ఏమిటనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని చెప్పారు. స్థానిక గొడవల కారణంగానే ఈ దాడి జరిగి ఉండొచ్చని తాము భావిస్తున్నామన్నారు. థియేటర్‌పై ఈ దాడి జరగడం సినీప్రియులను కలవరపాటుకు గురిచేస్తోంది.ఉగ్ర దాడిలో అమరుడైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితాన్ని ఆధారంగా చేసుకొని రాజ్‌కుమార్ పెరియసామి ఈ సినిమాను తెరకెక్కించారు. ముకుంద్ పాత్రలో శివకార్తికేయన్.. ఇందు (ముకుంద్ సతీమణి) పాత్రలో సాయిపల్లవి యాక్ట్ చేశారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్ హాసన్ దీనిని నిర్మించారు. జీవీ ప్రకాశ్ స్వరాలు అందించారు. ఎన్నో అంచనాల మధ్య




దీపావళి కానుకగా అక్టోబర్ 31న ఇది విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. సాయిపల్లవి – శివ యాక్టింగ్‌ను సినీ ప్రియులతోపాటు విశ్లేషకులు కూడా మెచ్చుకున్నారు. ముఖ్యంగా సినిమా క్లైమాక్స్‌లో సాయిపల్లవి తన నటనతో ప్రేక్షకులతో కంటతడి పెట్టించారు. ఈ సినిమా అవకాశం వచ్చినప్పుడు.. తన పాత్ర ఎలా ఉంటుంది? ఎంత నిడివి ఉంటుంది? అనేది తాను ఎక్కువగా ఆలోచించలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తోన్న ఆదరణ తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని టీమ్ ఇటీవల ప్రకటించింది.

## పుష్ప2 సినిమా నిర్మాతలకు 7 కోట్లు మిగిల్చిన డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల.. ఎలాగో తెలుసా?



అల్లు అర్జున్ నటిస్తోన్న 'పుష్ప 2' మరికొన్ని రోజుల్లో విడుదల కానుంది. మరో రెండు రోజుల్లో అంటే నవంబర్ 17న ఈ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. చిత్ర కథానాయిక రష్మిక మందన్న తెలిపిన సమాచారం ప్రకారం ఈ షూటింగ్ పూర్తయింది.తాజాగా రష్మిక మందన్న స్వయంగా తన డబ్బింగ్ పూర్తి చేసింది. ఈ లోని స్పెషల్ సాంగ్ షూటింగ్ ఇంకా పూర్తి కాలేదని అంటున్నారు. ఈ సాంగ్ కోసం చాలా మంది నటీమణులను పరిశీలించిన దర్శకుడు సుకుమార్.. చివరకు డ్యాన్సింగ్ క్వీన శ్రీలీలని ఎంచుకున్నాడు. 2021లో విడుదలైన 'పుష్ప' లో సమంత ఓ ఐటెం సాంగ్‌లో నర్తించింది. ఈ పాట పెద్ద హిట్ అయింది. విడుదలకు ముందే విడుదలైన ఈ పాట ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలకపాత్ర పోషించింది. దాంతో 'పుష్ప 2' లోని ఐటెం సాంగ్‌ని కూడా సీరియస్‌గా పరిగణించిన చిత్ర బృందం.. ఆ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్‌ని తీసుకురావాలని చాలా ప్రయత్నాలు చేసింది. బాలీవుడ్ అందాల తారలు శ్రద్ధా కపూర్, కియారా అద్వానీని కూడా అడిగారు. సాహోతో తెలుగు ఆడియెన్స్ కు చేరువైన శ్రద్ధా కపూర్ అయితే దాదాపుగా ఫైనల్ అయిపోయింది. అయితే చివరికి మళ్లీ మనసు మార్చుకున్నపుష్ప 2 చిత్ర బృందం శ్రీలీలని స్పెష్ సాంగ్ కోసం ఎంపిక చేసింది. ఈ నిర్ణయంతో పుష్ప 2 చిత్ర బృందానికి ఏడు కోట్ల రూపాయలు ఆదా అయ్యాయి.పుష్ప 2' స్పెషల్ సాంగ్ కోసం డ్యాన్స్ చేయడానికి శ్రద్ధా కపూర్ 8 కోట్లు అడిగిందట. కానీ శ్రీలీల మాత్రం ఒక్క కోటి రెమ్యునరేషన్ తోనే ఈ సాంగ్ చేసేందుకు అంగీకరించిందని సమాచారం. కాగా శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అల్లు అర్జున్ ఎనర్జీకి తగ్గ నటి కావడంతో చిత్ర బృందం శ్రీలీలనే ఎంపిక చేసింది. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో కూడా లు చేస్తోన్న శ్రీలీల పుష్ప 2 సినిమాతో అక్కడ తన క్రేజ్ మరింత పెరుగుతుందని ఆశిస్తోంది.





## హాస్పిటల్ బెడ్‌పై యాంకర్ స్రవంతి.. నాలా ఎవరూ ఆ పని చేయవద్దంటూ

స్రవంతి చొక్కారపు..సినీ అభిమానులకు పెద్దగా పరిచిచం అక్కర్లేని పేరు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో అమ్మడు పేరు మార్మోగిపోతోంది. అందానికి అందం..టాలెంట్‌కు టాలెంట్ రెండు స్రవంతి సొంతం.ఓ ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టిన స్రవంతి... వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో జరిపిన ఓ ఇంటర్వ్యూతో లైఫ్ లైన్లోకి వచ్చింది.ఆ తర్వాత పుష్ప విడుదల సమయంలో చిత్ర యూనిట్‌తో చేసిన ఇంటర్వ్యూ స్రవంతి కెరీర్‌ను ఒక్కసారిగా మలుపు తిప్పింది.హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్‌లను స్రవంతి ఇంటర్వ్యూ చేసింది. ఆ సమయంలో ఆమె మాట్లాడిన రాయలసీమ యాసకు వీరిద్దరూ ఫిదా అయ్యారు. రాయలసీమ సినిమాలు తీస్తే కచ్చితంగా స్రవంతి రిఫరెన్స్ తీసుకుంటామని చెప్పడంతో ఓవర్ నైట్ స్టార్‌గా స్రవంతి మారిపోయింది. ఆ తర్వాత పలు షోలకు యాంకరింగ్ చేస్తూ తన పాపులారిటీని మరింత పెంచుకుంది. తనకు వచ్చిన ఈ క్రేజ్‌తో బిగ్‌బాస్‌లో కూడా అడుగుపెట్టింది ఈ హాట్ బ్యూటీ.ఇక సోషల్ మీడియాలో అమ్మడు చేసే రచ్చ అంతా ఇంతా కాదు. హాట్ హాట్ ఫోజులతో కుర్రకారకు నిద్రలేకుండా చేస్తోంది. పెళ్లైనా ఏమాత్రం తరగని అందంతో కుర్రాళ్ల మతి పోగొడుతుంది.ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫొటోలను పోస్ట్ చేస్తూ సందడి చేస్తోంది. పెళ్లైనప్పటికీ గ్లామర్ షోను ఏమాత్రం తగ్గించడం లేదు. డైలీ కొత్త కొత్త ఫొటో షూట్స్ ను పోస్ట్ చేస్తూ కుర్రకారుకు మైకం తెప్పిస్తుంటుంది. రోజు రోజుకు సోషల్ మీడియాలో కూడా విపరీతంగా ఫాలోవర్లను పెంచుకుంటుంది. అలాంటి స్రవంతి తాజాగా హాస్పిటల్ బెడ్ ఉన్న ఫొటోలను షేర్ చేసి షాకిచ్చింది.'అసలు ఇలాంటి పోస్ట్ పెట్టాలని ఎప్పుడు అనుకోలేదు. ఇప్పుడు పెట్టక తప్పలేదు, కేవలం అవేర్నెస్ కోసం మాత్రమే. స్పెషల్ గా "ఆడవారి కోసం" పెడుతున్నాను. గత 35 – 40 రోజుల నుండి ఆన్ అండ్ ఆఫ్‌గా విపరీతమైన బ్లీడింగ్ అవుతోంది. రకరకాల మెడిసిన్ వాడాను. డాక్టర్‌ను డైరెక్ట్‌గా వెళ్లి చూపించే సమయం లేక స్కానింగ్ చేపించుకోలేదు. ఒక రోజు షూట్ మార్నింగ్ 6:45 నుంచి నెక్స్ట్ డే ఎర్లీ మార్నింగ్ 2:45 వరకు జరిగింది. అప్పుడే నాకు విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. దీంతో వెంటనే డాక్టర్‌ను కంసల్ట్ అయ్యాను.అప్పుడు తెలిసింది ఇది చిన్న సమస్య కాదు అని, వెంటనే అడ్మిట్ అయ్యి సర్జరీచేయించుకోవాల్సి వచ్చింది. అయితే నేను కంప్లీట్‌గా రికవర్ అవ్వాలి, ముందు లాగ నడవాలి అంటే ఒక 4 నుండి 5 వారాలు పడుతుందని డాక్టర్ చెప్పారు.సో నేను చెప్పాలి అనుకున్నది ఏంటంటే.. అయ్యో ఆల్రెడీ షూట్ కోసం డేట్స్ ఇచ్చేశాను మళ్లీ హెల్త్ బాలేదు అని పర్మిషన్ అడిగితే వాళ్ళు ఏమైనా అనుకుంటారేమో, ఇబ్బంది పడుతారేమో అని ఫీల్ అవ్వకండి. అది మీరు వర్క్ చేసే ఏ ప్రొఫెషన్ అయినా సరే, హెల్త్ ఈజ్ యువర్ ఫస్ట్ ప్రయారిటీ. వర్క్, షూట్స్,ఈవెంట్స్ అని కుదరక నెగ్లెట్ చేయకండి. ముందు హెల్త్ జాగ్రత్తగా కాపాడుకోండి. ఇవన్నీ ఆటోమేటిక్‌గా సెట్ అవుతాయి" అంటూ ఓ సుదీర్ఘ పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది.దీనికి తాను హాస్పిటల్ బెడ్‌పై ఉన్న కొన్ని ఫొటోలను సైతం జత చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె అభిమానులు ఆందోళన చెందుతూ స్రవంతి చొక్కారపు త్వరగా కోలుకోవాలని కామెంట్లు పెడుతున్నారు.



## వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల ప్లేయర్



దాదాపు 35 ఏళ్ల కిందట సచిన్ 16 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడనే వార్తలు విన్నాం. క్రికెట్ దిగ్గజం దాదాపు 24 ఏళ్లపాటు ఆటను శాసించాడు.ఆ తర్వాత ఆ స్థాయిలో సంచలనం ఎక్కడా నమోదు కాలేదు. తాజాగా ఐపీఎల్ మెగా వేలంలో ఓ ఆటగాడిని ఫ్రాంచైజీ దక్కించుకుంటే మాత్రం క్రికెట్‌లో మరో వండర్ క్రియేట్ అయినట్లే. ఇంతకీ ఏంటనేగా మీ సందేహం.. అదేంటో తెలియాలంటే ఇది చదివేయండి..సాధారణంగా 13 ఏళ్ల వయసు కలిగిన పిల్లలు స్నేహితులతో ఆడుకుంటూ సరదాగా గడిపేస్తూ ఉంటారు. కానీ, బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ మాత్రం క్రికెట్టే ఊపిరి అంటూ ఒక్కో మెట్టు పైకి ఎదుగుతూ వస్తున్నాడు. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. స్టార్లుగా ఉన్న ప్లేయర్లే తమను తీసుకుంటారో లేదోనని సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మనకెందుకులే అనుకొని వేలానికి కూడా దూరంగా ఉండిపోయినవారూ లేకపోలేదు. చివరికి ఐపీఎల్ మేనేజ్‌మెంట్ వేలం షార్ట్‌లిస్ట్‌ను బయట పెట్టింది. అందులో వైభవ్ మాత్రం రూ.30 లక్షల బేస్ ప్రైస్‌తో తన పేరును ఎంట్రీ చేయించాడు. మరి అతడిని ఏ ఫ్రాంచైజీ తీసుకున్నా సంచలనమే కదా. దీంతో అతడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? ఎలా ఆడతాడు? అనే ప్రశ్నలు క్రికెట్ అభిమానుల్లో రావడం సహజమే కదా.బిహార్‌లోని తాజ్‌పుర్ గ్రామానికి చెందిన వైభవ్ సూర్యవంశీ 2011లో జన్మించాడు. నాలుగేళ్ల వయసులోనే బ్యాట్‌ను పట్టిన అతడి ఆసక్తిని చూసిన తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించాడు. మరో నాలుగేళ్లకే సమస్తిపుర్‌లోని క్రికెట్ అకాడమీలో చేర్పించాడు. రెండేళ్లపాటు శిక్షణ పొందిన అతడు అండర్ -16 జట్టులోకి వచ్చేశాడు. అప్పటికి వైభవ్ వయసు కేవలం 10 ఏళ్లే కావడం గమనార్హం. ఎడమ చేతివాటం కలిగిన వైభవ్ బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ రాణించగలడు. 2024లోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన వైభవ్ ఐదు మ్యాచ్‌లు ఆడాడు. ఓపెనర్ అయిన వైభవ్ దూకుడుగా ఆడటంలో నేర్పరి. ఫీల్డింగ్ సెటప్‌ను ఆసరాగా చేసుకొని బౌండరీలు బాదేస్తాడు.

## బోర్డర్-గావస్కర్ ట్రోఫీ..నన్నెవరూ సంప్రదించలేదు: శార్దూల్ ఠాకూర్



ఆస్ట్రేలియా గడ్డపై పేస్ ఆల్‌రౌండర్లకు భలే గిరాకీ. కానీ, భారత జట్టులో సీనియర్ పేస్ ఆల్‌రౌండర్లుగా ఉన్న హార్దిక్ పాండ్య, శార్దూల్ ఠాకూర్‌కు అవకాశం దక్కలేదు.పాండ్య స్వతహాగా టెస్టులకు దూరంగా ఉంటుండగా.. శార్దూల్ మాత్రం సర్జరీతో ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. దీంతో తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డికి ఛాన్స్ దక్కింది. ఇప్పటికే ఆసీస్‌కు వెళ్లిపోయిన అతడు ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్‌లో నాణ్యమైన బౌలింగ్ వేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. శార్దూల్‌ను కాదని నితీశ్ ఎంపికపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కీలక వ్యాఖ్యలు చేశాడు. కానీ, తననెవరూ సంప్రదించలేదంటూ తాజాగా శార్దూల్ ఠాకూర్ వ్యాఖ్యానించడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది."నేను శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత విశ్రాంతి తీసుకొని మళ్లీ మైదానంలోకి దిగాను. జాతీయ సెలక్టర్ల నుంచి నాకెలాంటి సమాచారం రాలేదు. నాకు సర్జరీ కావడం వల్లే వారు మరొక ఆప్షన్‌కు వెళ్లినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నా ఫిట్‌నెస్ చాలా బాగుంది. ఆస్ట్రేలియా పర్యటన సుదీర్ఘంగా జరుగుతుంది. తప్పకుండా ఏదోఒక దశలో నాకు అవకాశం వస్తుందని భావిస్తున్నా. ఆ సిరీస్ కాకపోయినా.. మున్ముందు చాలా మ్యాచ్‌లు జరుగుతాయి. ఇంగ్లండ్ జట్టు మన దేశానికి రానుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ముందుంది. నా ఫిట్‌నెస్‌తోపాటు ఆటపై దృష్టిపెట్టా. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా వందశాతం నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. జట్టులోకి పునరాగమనం చేసినప్పుడు తొలి రెండు మ్యాచుల్లో కుదురుకొనేందుకు ఇబ్బందిపడాల్సి ఉంటుంది. ఒక్కసారి బౌలింగ్‌లో లయను అందుకొంటే ఆ తర్వాత వెనక్కితిరిగి చూడాల్సిన అవసరం లేదు" అని శార్దూల్ వెల్లడించాడు. 2020/21 సిరీస్‌లో ఒక్క మ్యాచ్ ఆడిన శార్దూల్ ఏడు వికెట్లు పడగొట్టాడు."భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని అడ్డుకొనేందుకు ఆసీస్ పేసర్లు తమ అస్త్రాలను సిద్ధం చేసుకుంటారనడంలో సందేహం లేదు. కోహ్లీని ఔట్ చేసేందుకు ఆఫ్‌సైడ్ బంతులను సంధించడం ఖాయం. అప్పుడు డ్రైవ్ చేసేందుకు ప్రయత్నిస్తే వికెట్ దొరకుతుందనేది వారి ఆశ. అయితే, కోహ్లీకి కూడా తన వికెట్ కాపాడుకోవడం ఎలాగో తెలుసు. గతంలో ఆసీస్‌పై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన అనుభవం అతడి సొంతం. ఈసారి పెద్దగా ఫామ్‌లో లేదు. ఒక్కసారి కుదురుకుంటే మాత్రం ఆపడం ఎవరితరమూ కాదు" అని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

## సెంచరీల సంజూ..ఆ ఒక్క బలహీనత దాటితే అదుర్స్..!



అవకాశాల కోసం ఎదురు చూస్తాడు.. వచ్చినప్పుడు వాటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోడు.. ఇది సంజూ శాంసన్ పై గతంలో ఉన్న అపవాదు.వాటన్నింటినీ తిప్పికొడుతూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ లో రెండు సెంచరీలతో చెలరేగాడు. అయితే.. ఈ సిరీస్‌లో మరో రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో.. కొడితే సెంచరీయే లేదంటే సున్నాకే ఔట్ అంటూ సంజూపై ఇప్పుడు కొత్త ప్రచారం మొదలైంది. టీ20ల్లో అతడు ఆడిన గత పది ఇన్నింగ్స్‌లను గమనిస్తే ఇదే అర్థమవుతోంది. దీంతో అతడు తనకున్న ఆ ఒక్క బలహీనతను అధిగమించి మరిన్ని సూపర్ ఇన్నింగ్స్‌లు ఆడాలని ఆభిమానులు కోరుకుంటున్నారు.టీ20ల్లో గత పది ఇన్నింగ్స్‌ల్లో మూడు సెంచరీలు నమోదు చేశాడు సంజూ శాంసన్.నాలుగు సార్లు డకౌట్ అయ్యాడు. మిగతా సందర్భాల్లో నామమాత్రపు స్కోరుకే పరిమితమయ్యాడు.టీ20ల్లో ఒకే ఏడాది మూడు సెంచరీలు కొట్టిన క్రికెటర్‌గా సంజూ శాంసన్ రికార్డు నమోదు చేశాడు. బంగ్లాదేశ్‌పై ఒకటి, దక్షిణాఫ్రికాపై రెండు శతకాలు కొట్టాడు.దక్షిణాఫ్రికాపై తొలి టీ20లో శతకం(107)తో విరుచుకుపడ్డ అతడు.. అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా రెండు శతకాలు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. అ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో సున్నాకే ఔటయ్యాడు. తనపై విమర్శలు వ్యక్తమైన వేళ.. చివరి టీ20లో మరోసారి సెంచరీతో చెలరేగాడు.అంతకుముందు బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో హైదరాబాద్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో 47 బంతుల్లో 111 పరుగులతో వీరవిహారం చేశాడు.బంగ్లాతో సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో మాత్రం అతడు చేసిన పరుగులు 10, 29 మాత్రమే.శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో సున్నాకే ఔటయ్యాడు. అంతకుముందు జింబాబ్వేతో జరిగిన చివరి టీ20లో అర్ధ శతకం చేసి రాణించాడు.ఇప్పటి వరకూ 37 టీ20లు ఆడిన సంజూ మొత్తం 810 పరుగులు నమోదు చేశాడు. ఇందులో మూడు శతకాలు, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి.ఇక వన్డేల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. 16 వన్డేలు ఆడిన అతడు మొత్తం 510 పరుగులు నమోదు చేశాడు.దక్షిణాఫ్రికాతో గత ఏడాది డిసెంబర్‌లో చివరి సారిగా ఆడిన వన్డేలో అతడు శతకం నమోదు చేశాడు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| ఆదివారం 17 నవంబర్ - 2024 || పేజీలు : 4

# కాలుష్యరహిత సమాజం కోసం పాటు పడాలి




- ప్రజలకు మంచి చేసే ఏ పనినైనా ప్రోత్సహించాల్సిందే
- భూమి, గాలి, నీళ్లలో రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుంది
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి

**చండూర్ శాసనసభ ప్రతినిధి:** కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ఇండస్ట్రియల్ పార్కులో కాలుష్య రహిత పర్యావరణహిత క్యారీ బ్యాగ్స్ ఉత్పత్తి చేసే రమణి ఇండస్ట్రీని రాజగోపాల్ రెడ్డి, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పాల్తిన్ క్యారీ బ్యాగ్స్ వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యంగా మారాయని, పర్యావరణానికి హాని చేయకుండా ఉండే క్యారీ బ్యాగ్స్ ని ఉత్పత్తి చేసే టెక్నాలజీని రూపొందించిన డి ఆర్ డి ఓ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పర్యావరణానికి మేలు చేసే క్యారీ బ్యాగ్స్ ఉత్పత్తి చేసే పరిశ్రమను స్థాపించిన రమణి ఇండస్ట్రీస్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరు పర్యావరణానికి మేలు చేసే పరిశ్రమలు స్థాపించాలని అటువంటి వారికి తమ పూర్తి సహకారం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో కాలుష్యం ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నతీరు చూసి మనసుని కలచి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, తెలంగాణ ఇండస్టియల్ ఫెడరేషన్ చైర్మన్ సుధీర్ రెడ్డి, డి ఆర్ డి ఓ సైంటిస్ట్ వీరబ్రహ్మంలతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి

## కవిత్వం

పిల్లనగోవికీ వున్న గాయాలే
మధుర గానంకు మూలమగు
నరుడి అస్థిత్వం కు అరిషడ్వర్గలే కారణమగు

ఇంట్లో ఎన్ని దీపాలు వెలిగించినా
హృదయంలో చంద్రుడుదయించకపోతే
ఆ రాతిరి శూన్యం వెన్నెల నిష్ఫలం.

నిన్ను కలవాలనీ కొందరు తపిస్తారు
నీ వెనుక తిరుగుతారు సందేశాలు పంపు
తీరా వెళ్ళిపోయాక నీవు స్పందిస్తే ఏం లాభం.

ఇనుము కొలిమిలో కరిగినట్లు సమయం
కరుగు ప్రాప్తమింతేననీ వేదాంతమెందుకు
ప్రయత్నిస్తే పాషాణాన్నికైనా ప్రాణమొస్తుంది.

ఎక్కడ ఆశలులేవో అక్కడ జీవితముంది
ఎక్కడ జీవితం లేదో అక్కడ ఆశలున్నాయి
భవిత లేదనీ చింతెందుకు మోడు చిగురించు.

గంజాయి వృక్షలాంటి మనుష్యుల మధ్య
చందన చెట్లులేన్ని నాటిన సువాసన ఇస్తుందా
విషపాత్రలో అమృతం కుమ్మరిస్తే ఏం లాభం.

**డా.ఐ.చిదానందం**
**చరవాణి - 8801444335**

## నూతన ఎస్సై ని సన్మానించిన సంతోష్ యాదవ్



**మర్రిగూడ, నవంబర్ 16(శాసన సభ ) :** మర్రిగూడ మండలానికి నూతనంగా విచ్చేసి బాధ్యతలు చేపట్టిన ఎం.కృష్ణారెడ్డి ని శనివారం యరగండ్ల పల్లి గ్రామానికి చెందిన యువజన నాయకులు,సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలవేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ అంశాలకు తావు లేకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరినట్లు ఆయన వెల్లడించారు. విధి నిర్వహణలో పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తానని సంతోష్ యాదవ్ హామీ ఇచ్చారు. ఎస్. ఐ మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతలు పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవవచ్చునని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మాధ్యం తదితరవాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యరగండ్ల పల్లి బి.ఆర్. ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు సీత నర్సింహ్మా, వల్లంలయాదయ్య,వనపర్తి నర్సింహ్మా, అందుగుల శ్రీను,సీత,ఇరగోని శ్రీను, గండు జంగయ్య గౌడ్,కృష్ణ,చామకురి ముత్తు గౌడ్,వనపర్తి శంకర్,సీత లింగం, ఎస్. శ్రీను,వనపర్తి వెంకటేష్,కేశగోని మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆ విషయంలో చావటానికైనా సిద్ధం..
### కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేశామంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తరహాలోనే రేవంత్ రెడ్డి పాలన కూడా కొనసాగుతోందని పోల్చారు. రాష్ట్రంలో అవే అబద్ధాలు, అరాచకాలు నడుస్తున్నాయని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. వడ్లకు బోనస్ ఇస్తామని.. బోగస్ మాటలు చెప్పి తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సోదరుల డైరెక్షన్లోనే రాష్ట్రంలో పోలీసు నియామకాలు, బదిలీలు జరుగుతున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యల వల్లే వికారాబాద్లో కలెక్టర్పై గ్రామ-స్థులు దాడి చేశారంటూ కిషన్ రెడ్డి మండిపడ్డారు. కక్ష సాధింపు చర్యలతో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కాంగ్రెస్కు ఏకైక ఏటీఎమ్గా తెలంగాణ మారిందన్నారు. మూసీ పునరుజ్జీవనానికి ప్రతిపక్షాలు అడ్డొస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారని చెప్పుకొచ్చిన కిషన్ రెడ్డి.. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ అభివృద్ధి కార్యచరణే లేదని మండిపడ్డ కిషన్ రెడ్డి.. హైదరాబాద్లో పేదల ఇండ్లు కూల్చేస్తూ.. నల్గొండలో రైతులను రెచ్చగొడుతుండటం తప్ప వాళ్లు చేసేదేమీ లేదని రేవంత్ రెడ్డి సర్కార్పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పుకొచ్చారు. కేటీఆర్ను అరెస్ట్ కాకుండా బీజేపీ అడ్డుకుంటుందనేది పూర్తిగా అసత్య ప్రచారమని కిషన్ రెడ్డి కొట్టిపారేశారు.

## పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** జగిత్యాల పట్టణంలోని పురానిపెట్ ఉన్నత పాఠశాలలో రూ.13. 5 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, స్థానిక కౌన్సిలర్ పులి రమ, హెడ్ మాస్టర్ రాజయ్య, ఏఈ ధనుంజయ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, ఎంఈవో భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత




**చందూరు నవంబర్ 16 (శాసనసభ న్యూస్) :** చందూరు మండలం శనివారం రోజు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాదగోని వెంకటేశ్వర్లు కి మండల విద్యాధికారి సుధాకర్ రెడ్డి చేతుల మీదగా 20 వేల వ్యయంతో కూడిన "ప్రొజెక్టర్" అందజేసిన కస్తూరి ఫౌండేషన్ పిన్నింటి నరేందర్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడమే కాకుండా ప్రతి పేద విద్యార్థి చదువుకు దూరం కావొద్దని ఉద్దేశ్యంతోనే కస్తూరి ఫౌండేషన్ పని చేస్తున్నదన్నారు. ప్రొజెక్టర్ ద్వారా పాఠశాల విద్యార్థులకు డిజిటల్ క్లాస్ లు, ఆన్లైన్ క్లాస్ ల ద్వారా పాఠాలు బోధించి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరి ఫౌండేషన్ సేవలను కొనియాడుతూ చరణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారిగడ్డ మాజీ ఎంపీటీసీ సభ్యులు పల్లె వెంకన్న, చందూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ల బిక్షం, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహా రావు, రమాదేవి, తదితరులు, పాల్గొన్నారు.

# అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

## - దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి.




**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, శాసనసభ న్యూస్ నెట్వర్క్ ఇంచార్జ్ నవంబర్ 16 :** శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, వనరులు ఉన్నందున జిల్లాను అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో మున్సిపాలిటీలలో,గ్రామ పంచాయతీలలోని సమస్య లను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగించేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని బస్తీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, జిల్లా ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజధానికి సమీపాన ఉన్నందున కూరగాయలకు మంచి డిమాండ్, మార్కెట్ ఉందని అందువలన ప్రత్యామ్నాయంగా రైతులు కూరగాయలు, పండ్లు పండించే విధంగా రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించుకోవాలని, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని, రక్తహీనతను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగాలు కల్పించాలని ఉపాధి కల్పనాధికారిని ఆదేశించారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని పరిశ్రమల శాఖ అధికారికి సూచించారు. సమావేశంలో భాగంగా పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఉపాధి హామీ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, భూగర్భ జలాలు, సీపీఓ, గిరిజన సంక్షేమ శాఖ, వివిధ శాఖలకు సంబంధించి తదితర అంశాలపై సమీక్షించా రు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని చైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) ప్రతిమ సింగ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్, హెచ్. ఎమ్.డబ్ల్యూ డిసి, ఈ.డి.మయంక, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా అధికారులు తదితలురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ను మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తాం

## - కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చండూర్ నవంబర్ 16 (శాసనసభ న్యూస్) :** మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేయడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో ఒకటి నుండి పదవ తరగతి వరకూ ఒకే కాంపౌండ్ లో చదివే విధంగా, మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తానని, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యా శాఖ అధికారులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశించారు. మొదటి విడతగా 30 నుండి 40 ప్రభుత్వ పాఠశాలల ను మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పరంగా ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పాటు పడాలని అధికారులను కోరారు. ఈ



కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి, వివిధ మండలాల ముఖ్య నాయకులు, డిఈఓ బిక్షపతి, మునుగోడు, చండూర్, మర్రిగూడెం, ఘట్టుప్పాల్ మండలాల ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ లు పాల్గొన్నారు.

# ఇండియన్ స్పోర్ట్స్ వింగ్ తెలంగాణ అధ్యక్షునిగా మంకాల అశోక్ కుమార్

**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 16 :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి చెందిన కరాటే గ్రాండ్ మాస్టర్ మంకాల అశోక్ కుమార్ ఇండియన్ స్పోర్ట్స్ వింగ్ తెలంగాణ అధ్యక్షునిగా ఎన్నిక య్యారు. నవంబర్ 13వ తేదీన కొత్త ఢిల్లీలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ వింగ్ (ఫ్రాన్స్), నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిచే నియామక పత్రం అందించడం జరిగింది. గతంలోనుండి, ఇప్పటివరకు బాలికల స్వీయ రక్షణకు శిక్షణ అనే నినాదంతో బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే, జూడో, యోగ, నాంచాక్, కట్ కరాటే, కరాటే ఫైట్, సెల్ఫ్ డిఫెన్స్ ఆర్టీ






శిక్షణ తదితర మెలకువలతో బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. ఉత్తమ సేవలను గుర్తించి ఇండియన్ స్పోర్ట్స్ వింగ్ అధ్యక్షుడిగా కరాటే గ్రాండ్ మాస్టర్ మంకాల అశోక్ కుమార్ ను నియమించారు. నియామకంతో నాకు మరింత బాధ్యత పెరిగిందని, నియమించిన వారికీ, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏపీ శ్రీనాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటర్మీడియట్ మెమో పోయింది

## - ఎవరికైనా దొరికితే ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి.

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 16 :** చింతపల్లి మండలం మాజీ జెడ్పిటిసి మాస మంజుల భాస్కర్ కూతురు మాస త్రిష శనివారం రోజు చింతపల్లి సాయిబాబా టెంపుల్ ను దర్శించుకుని వెళదామని బైక్ పై వస్తుండగా పెట్రోల్ ట్యాంక్ కవర్లో ఉన్న ఇంటర్మీడియట్ మెమో కవర్ మిస్ అయిందని తెలియజేసింది. ఎవరికైనా నా ఇంటర్మీడియట్ మెమో దొరికినట్లైతే దయచేసి మా నాన్నగారు మాస భాస్కర్ సెల్ నెంబర్ 9866167979 కు తెలియజేయాలని విజ్ఞప్తి.



TELANGANA STATE BOARD OF INTERMEDIATE EDUCATION : HYDERABAD

Memorandum of Marks

7078

TS-B 134037

1858262436

MASA TRISHA

MASA BHASKAR

MASA MANJULA

MARCH - 2018 (REG)

ENGLISH

GRAND TOTAL: 926 *NINE**TWO***SIX*

RESULT A GRADE

DATE 13-04-2018

CONTROLLER OF EXAMINATIONS

# అరెస్టులు కాదు.. స్వాతి కుటుంబానికి న్యాయం చేయాలి

## విద్యార్థి నాయకుల పై దాడి చేసిన సిబ్బందిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## సంజీవరెడ్డిని స్వగృహంలో అరెస్టు చేసిన యాచారం పోలీసులు




**యాచారం శాసనసభ న్యూస్( నవంబర్ 16) :** బాసరలో IIIT లో ఆత్మహత్య చేసుకున్న స్వాతి విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఉద్యమాలు ఆగవని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జైంట్ సెక్రెటరీ వంగ సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి లో కొత్తపల్లి హౌస్ అరెస్ట్ చేయడం యాచారం పోలీసులను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాసరలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి ఈనెల 12న హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని , ఏబీవీపీ నాయకులు పరామర్శించడానికి వెళ్లితే, ఆ విద్యార్థికి న్యాయం చేయకుండా యూనివర్సిటీ విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఒక విద్యార్థి చనిపోతే ఇలా ఏబీవీపీ నాయకులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ విద్యార్థిని ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. స్వాతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# కలెక్టర్ కార్యాలయం ముందు నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

## విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య



**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 16):.** ఆసర పింఛన్ పెంపు సాధనకై నవంబర్ 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా ఈనెల 18న నిరాహార దీక్షలు చేపట్టాలని కోరారు. లేనియెడల రాష్ట్ర ప్రభుత్వం పై వికలాంగులు భారీ ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు

# అధిక ధరలు వసూల్ చేస్తున్న గ్యాస్ ఏజెన్సీ

## - దురుసుగా మాట్లాడుతున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది







**చండూరు నవంబర్ 16(శాసనసభ న్యూస్) :** శ్రీ సాయి దుర్గ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నల్గొండ యజమాన్యం వారు చండూరులో ఒక్కొక్క గ్యాస్ సిలిండర్ పై అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్యాస్ ధర రూ.874 అయితే శ్రీ సాయి దుర్గ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారు వినియోగదారుల నుండి 930 రూపాయలు వసూలు చేస్తూరు. వినియోగదారులు సబ్సిడీ గురించి, బుకింగ్ గురించి ఏజెన్సీ వారిని వివరణ అడిగితే వారు వినియోగదారుని పట్ల అగౌరవంగా, అమర్యాదగా మాట్లాడుతూ అవహేళన చేస్తూ మిగతా కంపెనీల కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై చండూరు మండల పరిసర ప్రాంత వినియోగదారులు అభ్యంతరం తెలుపుతూ, ఆగ్రహం వ్యక్తం చేస్తూన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు నారపాక ఆంజనేయులు , మాధవి, సైదమ్మ, భూపాల్ రెడ్డి, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పాషా నరహరి స్మారక కేంద్రంలో సి,ఐ,టి,యు,ముఖ్య కార్యకర్తల సమావేశం

## - సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్





**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 16 :** ఇబ్రహీంపట్నం పాషా నరహరి స్మారక కేంద్రంలో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఆర్టీసీ కార్మిక సంఘాల పై ఆంక్షలు ఎత్తివేయాలని సిఐటి,యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుండి ఆర్టిసి కార్మిక సంఘాలపై వేధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీలో నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక భద్రత పథకాలైన పిఎఫ్,ఎస్ ఆర్ బి ఎస్, ఎస్ బి టి ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రానైష్ ను నియమించాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్దించాలని, గత టి,ఆర్, ఎస్, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికోద్యమం పై ఆంక్షలు విధించింది. కార్మికుల నుండి ప్రశ్నే రాకుండా చేయడం ద్వారా ఆర్టీసీని తమ ఇష్టారాజ్యంలో నడపడం కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం చేసింది, డిపో మేనేజర్ నుండి పై వరకు తమ ఇష్టారాజ్యంగా వివరిస్తున్నారు పని గంటలు పనివేళలు పనిభారాలు విపరీతంగా పెంచారు. వారంలో ఆరు రోజులపాటు సింగిల్ డ్యూటీ చేస్తున్నారు.సిబ్బంది సరిపోను లేరని ఆఫ్ క్యాన్సిల్, డబల్ డ్యూటీలు చేయాలని, ఒత్తిడి చేయడమే కాకుండా డ్యూటీ అయి-ంపోయిన తర్వాత కూడా మరో ట్రిప్ వేయమని బలవంతంగా చేస్తున్నారు. మహిళలను కూడా మినాయించడం లేదు, పెరిగిన పని భారం మూలంగా మహిళలను కూడా అర్ధరాత్రి వరకు డ్యూటీలు చేస్తున్నారని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిఆర్ఎస్ లో యూనియన్ కార్యక్రమాలకు అనుమతి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ కార్మికులకు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తయిన ఇంత వరకు ఆహామీలు అమలు చేయడం ఆర్టీసీ సమస్య లు వెంటనే పరిష్కారించాలని,నవంబర్ 19న హైదరాబాదులో బస్ భవన్, జిల్లాలోని డిపోల వద్ద ధర్నాలు జరపాలని, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించాలని ఆర్టీసీ కార్మికులు అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా కార్య దర్శి చంద్రమోహన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, కవిత, బ్రమ్మయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు చింత పట్ల ఎల్లేశ, ఈ. నర్సింహా, పి. కృష్ణ, బుగ్గ రాములు, టి. నర్సింహ్మా, కె.చందునాయక్, నర్సిరెడ్డి,వీరయ్య, శేఖర్,సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేసిన కొరటికల్ కాంగ్రెస్ నాయకులు



**మునుగోడు, నవంబర్ 16 (శాసనసభ న్యూస్):** మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో పశు వైద్యశాలకు డాక్టర్ ను, ప్రహరీ గోడను మంజూరు చేయవలసిందిగా కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మందుల బీరప్ప ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వారి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రహరీ గోడను వెంటనే మంజూరు చేయించారు. ఈ కార్యక్రమం లో గ్రామ శాఖ అధ్యక్షులు దండు లింగస్వామి,పాల సంఘం చైర్మన్ బొడిశ సత్తయ్య, పిఏసిఎస్ డైరెక్టర్ కుతాటి బిక్షమయ్య,ఒర్సు వెంకన్న, వల్లూరు యాదయ్య,కమటాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బుకర్ ప్రైజ్-2024 విజేతగా సమంతా హార్వే

## - బహుమతి కింద రచయితకు 50 వేల పౌండ్లు (రూ.53.65 లక్షలు) అందజేస్తారు.




**చండూర్ నవంబర్ 16 (శాసనసభ న్యూస్) :** బ్రిటన్ రచయిత్రి సమంతా హర్వే రాసిన "ఆర్బిటల్" నవల 2024 ఏడాదికిగాను బుకర్ ప్రైజ్ విజేతగా ఎంపికైంది. పై నుంచి భూమి పై 16 సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను చూసిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని ఆరుగురు వ్యోమగాముల జీవితాల్లో ఒక రోజంతా జరిగే పరిణామాలను నవలలో ఈమె వివరించారు. ఈ అవార్డు సాధించిన తొలి అంతరిక్ష నేపధ్య రచనగా "ఆర్బిటల్" నిలిచింది.

# మాలధారణం..సకల పాప హారణం..

## - గత 30 ఏళ్లుగా అయ్యప్ప గురుస్వామి చెనమోని రాములు.

### పాటించవలసిన నియమాలపై ప్రత్యేక కథనం



అయ్యప్ప గురు స్వామి చెనమోని రాములు



కన్నె స్వాములకు మాలవేసి దీక్ష ఇస్తున్న రాములు గురు స్వామి



చింతపల్లి అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వాములు

**శాసనసభ న్యూస్ స్టేట్ నెట్వర్క్ ఇంచార్జ్. పి. వెంకటేష్ (నవంబర్ 16)**
స్వామియే.. శరణమయ్యప్ప... అనే శరణుఘోష వినిపించే రోజులివి. అయ్యప్ప నామంతో భక్తకోటి పులకించే సమయమిది.. కఠోర దీక్షలో నియమావళిని ఆచరిస్తూ స్వామి సేవలో తరించే కాలమిది.. అయ్యప్ప దీక్షలు చేపట్టేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చింతపల్లి మండలంలో ఎంతోమందికి అయ్యప్ప మాలలు ధరించి గురుస్వామి సూచన మేరకు పూజల్లో మునిగి తేలుతున్నారు. ఏటా మాలధారుల సంఖ్య పెరుగుతున్నదని గురు స్వామి చెనమోని రాములు తెలిపారు.

#### దీక్ష చేపట్టే విధానం

అయ్యప్పస్వామి మాల ధరించాలనుకునేవారు మూడు రోజుల ముందు నుంచే పవిత్రంగా ఉండాలి. మద్యం, మాంసం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలి. మాలధారణకు తల్లిదండ్రులు, భార్య అనుమతి ఉండాలి. తల వెంట్రుకలు, గోళ్లు, ముందుగానే కత్తిరించుకోవాలి. మాల ధరించే రోజు పాదరక్షలు లేకుండా శుభ్రమైన దుస్తులను ధరించి నల్లని లుంగీ, కండువా, చొక్కా, తులసిమాల తీసుకొని అయ్యప్ప ఆలయమ,సన్నిధానానికి రావాలి. ఆరుసార్లు శబరి యాత్రకు బయలుదేరి మకరజ్యోతిని దర్శించుకున్న గురుస్వామితో మాల స్వీకరించాలి. స్వీకరించే ముందు బ్రహ్మదేవుని చందనంగా, శివుడిని విభూదిగా, విష్ణువును కుంకుమ రూపంగా భావించి నుదిటిపై దిద్దుకోవాలి. కుటుంబంలో తల్లిదండ్రులు మరణిస్తే ఏడాదిపాటు మాల ధరించకూడదు. భార్య మరణిస్తే ఆరునెలల పాటు దీక్షకు దూరంగా ఉండాలని నియమంతో వేసే మాలకనుక చాలా పవిత్రంగా దీక్షను కొనసాగించాలన్నారు.

#### దీక్షలకు కార్తీకమాసమే అనువైన కాలం

కార్తీకమాసం పూజలకు పెట్టిందిపేరు. సూర్యోదయంలోగా స్నానాలు.. పూజలు.. ఉపవాసాలు.. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక కార్యక్రమాలే కనిపిస్తాయి. మాలధారణలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ఉట్టిపడతాయి. ఈ మాసంలోనే వేలాది మంది భక్తులు జ్యోతిస్వరూపుడు.. హరిహరసుతుడు.. శక్తిరూపుడైన అయ్యప్ప దీక్షను ఆచరిస్తారని తెలిపారు. శివునికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో కఠిన నియమ, నిష్టలతో అయ్యప్ప దీక్షలు చేపట్టడం జన్మజన్మల పుణ్యఫలంగా భావిస్తారని గురు స్వామి అన్నారు..శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకొని సన్మార్గంలో పయనింపజేసేదే అయ్యప్ప మండల దీక్ష. 41 రోజుల పాటు అయ్యప్పకు ఆత్మనివేదన చేసుకుంటూ నిత్యశరణు ఘోషతో పూజించాలని, మనసారా అయ్యప్పస్వామిని కొలవడమే ఈ దీక్ష పరమార్థమన్నారు. రోజులో ఒకసారి భిక్ష.. మరోసారి అల్పాహారం.. రెండుసార్లు చన్నీటి సాన్నం.. నేలపై నిద్రించాలనే కఠిన నియమాలతోరణమే ఈ దీక్ష.కనుక దీక్ష తీసుకున్న ప్రతివారు ఈ నియమాలను పాటిస్తే ప్రతి ఒక్కరి కుటుంబాలలో అయ్యప్ప స్వామి దీవెనలు ఉంటాయన్నారు. ఈసారి అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, ఆంజనేయ స్వాములు పెద్ద ఎత్తున దీక్షలు చేపట్టే అవకాశాలున్నాయని, పూజలు కూడాఅలాగే జరుగుతాయని రాములు గురుస్వామి తెలిపారు.

---

# గద్దర్ కుమార్తె వెన్నెలకు కీలక పదవి..

## రేవంత్ సర్కార్‌లో సముచిత స్థానం




**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలకు రేవంత్ రెడ్డి సర్కార్ కీలక బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్గా డాక్టర్ గుమ్మడి వి.వెన్నెలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు యువజన పురోగతి, పర్యాటన, సంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ శనివారం (నవంబర్ 16న) రోజున ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో.. గద్దర్ కుమార్తెకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సముచిత గౌరవం ఇచ్చినట్టయింది. కాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వెన్నెలకు కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. కాగా.. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన లాస్య నందిత విజయం సాధించారు. ఆ తర్వాత.. లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించగా.. కంటోన్మెంట్ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో మాత్రం.. వెన్నెలకు కాంగ్రెస్ అవకాశం ఇవ్వలేదు. ఆ సమయంలో.. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీకి వచ్చిన శ్రీగణేశ్కు టికెట్ ఇవ్వగా.. ఆయన విజయం సాధించారు.అయితే.. గద్దర్ చివరి రోజుల్లో కాంగ్రెస్ పార్టీతో తన ప్రయాణాన్ని సాగించారు. ఈ క్రమంలోనే.. రాహుల్ గాంధీతో, రేవంత్ రెడ్డితో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఎన్నికలకు కొద్ది రోజులు ముందే గద్దర్ కన్నుమూయగా.. ఆయన అంత్యక్రియలను కాంగ్రెస్ పార్టీనే దగ్గరుండి జరిపించింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా గద్దర్ సేవలను, ఆయన పోరాటాన్ని రేవంత్ రెడ్డి ప్రతిసారి స్మరించుకోవటమే కాకుండా.. ఆయన గుర్తుగా నంది అవార్డుల పేరును గద్దర్ అవార్డుగా పేరు మార్చారు. కేవలం గద్దర్ పోరాటాలను స్మరించుకోవటమే కాకుండా.. ఆయన కుటుంబ సభ్యులకు కూడా సముచిత స్థానం కల్పించి గౌరవించుకోవాలని భావించిన ప్రభుత్వం.. ఇప్పుడు వెన్నెలకు సాంస్కృతిక సారథి చైర్ పర్సన్గా నియమించింది.కాగా.. తెలంగాణలో ఉన్న కళాకారులందరినీ ఒక్కచోట చేర్చి.. వారితో తెలంగాణ సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వారితో ప్రచారం చేయిస్తూ ఉపాధి కల్పిస్తోంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలోనే ఈ సాంస్కృతిక సారథి సంస్థను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో.. ఈ సాంస్కృతిక సారథికి ఛైర్మన్గా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్గా ఉండగా.. ఆయకు కేబినెట్ హెూదా కల్పించారు. అయితే.. ఇప్పుడు గద్దర్ కుమార్తె వెన్నెలను ఛైర్ పర్సన్గా నియమించినప్పటికీ.. ఆమెకు కేబినెట్ హెూదా మాత్రం ఇవ్వకపోవటం గమనార్హం.

# సమగ్ర కుటుంబ సర్వే..

## కవిత వివరాలు సేకరణ



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** సీఎం రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కుటుంబ వివరాలను సిబ్బంది సేకరించారు.పలు రకాల ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తన నివాసంలో కవిత కుటుంబ సభ్యులు ఎన్యూమరేటర్లు అడిగిన ప్రశ్నలకు వివరాలు నమోదు చేశారు. సర్వే అనంతరం కవితకు కుల గణన చేసినట్లు ఫామ్ ఇచ్చారు.